తీరని కోరిక

ప్రహరీగోడ గేటుదాటి అరఫర్లాంగు దూరం నడిచి, బంగాళా మెట్లెక్కుతున్న ఉమ రమ అదృష్టాన్ని లోలోపల కనీసం నూరోసారి అభినందించుకుంది. వచ్చిన వ్యక్తినిచూసి సీమకుక్క లోకముడిచి ఇంట్లోకి దారితీస్తూ తల వెనక్కితిప్పి 'బౌ బౌ'మంది. నేలమీద కూచుని ఆకాశంవైపు చూస్తూ పరాకు చిత్తగిస్తున్న ముసలి నౌకరు రామయ్య ఉలిక్కిపడి ఉమని చూసి, ఊరుకోమన్నట్టుగా "మోతీ!" అని చిరాగ్గా కేకేశాడు. తదుపరి సింహద్వారం కర్టెన్ తొలగించుకుని ఒక పాతికేళ్ళ సుందర వదనారవిందం బయటికి తొంగిచూసింది.

"నువ్వేనా ఉమా! ఎవరో అనుకున్నాను."

"రమాదేవిగారు బలే కుక్కని సంపాయించారే!"

"ఏం?"

"ఏంలేదులే, చాలా అందంగా ఉంది"

"ఈమధ్యే కొన్నాను. అన్నట్టు దాన్ని కొన్నతరువాత నువ్వురావటం ఇదేగావును మొదలు."

"ఊఁ, మన రామయ్యేనా కొనుక్కొచ్చింది?"

"ఊఁ ఇంకెవరు?"

"అప్పుడే అనుకున్నాన్లే."

రామయ్య ఆమెవైపు కొంచెం అనుమానాస్పదంగా చూశాడు.

"ఏం, అలా అంటున్నావు?"

"రామయ్య సెలక్షన్ కాబట్టే అంత ధైర్యంగా వెనక్కి పరిగెత్తింది" ఉమ ముసిముసిగా నవ్వుతూ అన్నది. రామయ్యకి కొంచెం ఉక్రోషం వచ్చింది. ఉమ ఏదోఅనటం, రామయ్యకి ఉక్రోషం రావటం, తప్పనిసరిగా కనీసం నూరోసారి అది.

"తమర్ని చూసి అది పారిపోతోం దనుకున్నారేట్టా?"

"అబ్బే, నే నొచ్చానని మీ అమ్మగారితో చెప్పటానికి పోతోంది."

"నిజం మాట్లాడారు. మీరు నమ్మినా, నమ్మకపోయినా నూటికి నూరు పాళ్ళు అంతే" అన్నాడు రామయ్య దృఢంగా.

"సరేలే రామయ్యా, నీతో నాకు పోట్లాట ఎందుకు? నీ సెలక్షన్ మంచిదే, అయితే నాకో సందేహం పట్టుకుంది."

"సరేలే, లోపలికొచ్చి కూచుందూ" అన్నది రమ. కాని ఉమ ఆమె మాటలు వినిపించుకోలేదు.

"ఇంట్లో ఎవరూ లేనప్పుడు ఏ దొంగో వచ్చినా, అమ్మగారికోసం పరిగెత్తుకు పోదుగదా, ఈ బొచ్చుకుక్క?"

"తమరు మరీ సిత్రంగా మాట్లాడతారే."

"మరి నేను దొంగని కానని ఈ కుక్కకెలా తెలుసు?"

"తమర్ని చూస్తే తెలీదేట్లా."

"తెలుసుద్దేట్లా?" నవ్వాపుకుంటూ అన్నది ఉమ.

"ధగధగా మెరిసే ఆ వజ్రాల నెక్లేసు చూసి వొచ్చిందెవరో పసికట్టేసింది మా రాజాకుక్క."

ఉమ ఒక్కసారిగా నవ్వేసింది. రమకూడా ఒకసారి ఉమ నెక్లేసు వైపు చూసి శృతి కలిపింది.

"అయితే మీ కుక్క భలేగా బోల్తాపడ్డదిలే. ఇది ఇమిటేషన్ వజ్రాల నెక్లేస్. దొంగలూ, దొరలూకూడా కొనగలరు." అనేసి, లోపలికి వెళ్ళిపోయింది ఉమ రమతోసహా.

ఆమెవైపు కొంచెం ఆశ్చర్యంగా చూసి, "ఎంతే సరదాగా మాట్లాడుద్ది మా తల్లి" అనుకుని, మళ్ళీ నేలమీద చతికిలబడి ఏవో ఆలోచనలలో పడిపోయాడు రామయ్య. అది ఇమిటేషన్ వజ్రాల నెక్లేస్ అవటం అతనికి మహాశ్చర్యంగా వుంది. కాని నిమిషంలో అదేనా సంగతి పూర్తిగా మర్చిపోయి ఇతర విషయాల్ని గురించి ఆలోచించసాగాడు. రమ ఈ విషయం అంత సులభంగా మర్చిపోలేక పోయింది. ఆమె ఇమిటేషన్ వజ్రాల్ని గురించి విన్నది, కాని అవి గుర్తు తెలియకుండా అసలు వజ్రాలలా [illegible] కాగలవని ఆమెకి అదివరదాకా తెలియదు. తెలిసినతరువాత అవి ఆమెకి చాలా తమాషాగా కనిపించింది. ఉమ నెక్లేస్ వైపు ఆమె చాలాసార్లు సంభాషణ సాగుతున్నంతవరకూ అదో రకమైన విస్మయంతోనో, కుతూహలంతో చూసింది.

ఉమ వెళ్ళినతరవాత, ఉండబట్టలేక రామయ్యతో అన్నది రమ.

"చూశావా, రామయ్యా! ఉమాదేవిగారిది ఇమిటేషన్ వజ్రాల నెక్లేస్‌ట. తమాషాగా లేదూ?"

"తమాషా ఏముందమ్మా, ఈరోజుల్లో అన్నీ తమాషాలే, ఏవి కావు?"

"చూడటానికి బాగా నేవుంది. చెబితేగాని తెలీదు."

"ఔను."

"ఇహ అసలు వజ్రాలకి విలువ ఏముంటుంది?"

"అదేం మాటమ్మా?"

"తేడా తెలిస్తేనేగా విలువ?"

"ఎందుకు తెలవదు? తమలాంటోళ్ళు పెట్టుకుంటే అసలు వజ్రాలు. తక్కువోళ్లు పెట్టుకుంటే నకిలివి." చాలా సూక్ష్మవిషయం అన్నట్టుగా నవ్వేశాడతను. కాసేపటిదాకా రమ మాట్లాడలేదు. తరవాత అన్నది.

"మరి, డబ్బున్నవాళ్లుకూడా అవే పెట్టుకుంటే?"

రామయ్య కొంచెం చిక్కులోపడ్డవాడిలా ముఖంపెట్టి, మళ్ళీ ఏదో స్ఫురించగా నవ్వేసి అన్నాడు.

"ఎందుకు పెట్టుకుంటారమ్మా డబ్బున్న మారాజులు? ఎవరో పీనాసోళ్లుంటే ఏమోగాని..."

"ఊరికే, తమాషాకి..."

"ఎవరన్నా తమాషాకి పెట్టుకుంటారా ఏమిటమ్మా? నడమంత్రపు సిరి పట్టుకొని కర్చుపెట్టలేక దాచుని నేవాళ్ళు ఆ మాటనాలగాని బయటికి..."

రమ కాసేపు ఊరుకుని అన్నది.

"నాలాంటివాళ్లు పెట్టుకుంటే...?"

"తమలాంటివాళ్లు అసలు వాటిజోలికే పోరుగదమ్మా!"

రమ మళ్ళీ కాసేపు నిశ్శబ్దంగాఉండి తరవాత అన్నది. "మీ బాబుగార్ని తమాషా చేస్తే?"

ఈ సారి రామయ్య ఆమె ముఖంలోకి భావయుక్తంగా చూసి నవ్వుతూ అన్నాడు.

"ఈ ముసలోడ్ని ఆడించినట్టు బాబుగార్ని ఆడించగలరండమ్మా!"

"చూస్తే?"

"బాబుగారి విషయం నాకు బాగా తెలుసు. ఏమీ లాభంలే" దన్న ట్టుగా తల ఆడించాడు రామయ్య.

"చూద్దాం."

"అయితే ఆ అమ్మగారింటి కెళ్ళిరమ్మన్నారా?"

"ఎందుకు?"

"మరి యాడనించి వొస్తది? మనం కొనంగదా!"

"ఏం?" చిన్నగా నవ్వింది రమ.

"ఏం ఆడిస్తారండమ్మా! తమరి సంగతి నాకు తెలవనట్లు మాట్టాడతారు తరవాత పెట్టుకునే వాళ్ళయితే కొంటారు. గాని...సిత్రంగా మాట్టాడతారు."

"పెట్టుకుంటే గాని కొనగూడదా ఏమిటి?"

రామయ్య ఆమెవైపు అదోమాదిరిగా చూశాడు.

"ఏమైనా మనం నకిలీ వస్తువులు కొనంగదమ్మా అవి డబ్బులేనోళ్లు, పీనాసోళ్ళు కొనుక్కునేవి. ఇయాల అమ్మగారు నన్ను ఆడిస్తున్నారు."

రమ ఈసారి గట్టిగా నవ్వింది.

"తమాషాగా అన్నానులే"

"ఆ అమ్మగారింటి కెళ్ళిరానా?"

"ఇప్పుడు కాదులే తరవాత చెబుతాను.

రామయ్య ముసిముసిగా నవ్వుకున్నాడు. రమ అతనివైపు అలాగే కాసేపు చూసి చిన్నగా నవ్వి వెళ్ళిపోయింది.

♦ ♦ ♦ ♦

బిజినెస్ మాగ్నెట్ రామకృష్ణ సుపరిచితమైన కారు దుకాణంముందు ఆగగానే సేఠ్ రాజారాం ఉల్లాసంగా ఎదురువెళ్ళి రామకృష్ణనీ, రమాదేవినీ ఆహ్వానించాడు. "డైమండ్ నెక్లేసులు చూపించండి" రామకృష్ణ ఠీవిగా జేబు రుమాలుతో ముఖంతుడుచుకొంటూ ఆర్డరిచ్చాడు. షో కేసుల్లోంచి కళ్లు చెదిరినట్టుగా వజ్రాలహారాలూ, ఉంగరాలూ మొదలైనవి కనిపిస్తున్నాయి. సరిగా ఉమాదేవి నెక్లెస్ లాంటిదే ఒకటి కనిపించగా రమ దాన్ని చూపించ మంది. సేఠ్ ఒక క్షణం తెల్లపోయి "అది ఇమిటేషన్ వజ్రాల నెక్లెస్ అండీ." అన్నాడు. ఆమాట విని ఆమె రామకృష్ణవైపు చూసింది. అతని ముఖం కొంచెం చిన్నబోవటం ఆమె కనిపెట్టక పోలేదు. ఒక్క-క్షణం తొట్రుపడి అతనన్నాడు.

"ఆ నమూనా చాలా బావుంది. అటువంటిదే మంచి వజ్రాల నెక్లేస్ లేదా ?"

"ఎందుకు లేదు ?" సేఠ్ స్వయంగా వెళ్ళి ఒక చిన్న పెట్టె తీసుకొచ్చి నెక్లేస్ చూపించాడు. రామకృష్ణ 'ప్యాన్' చేశాడు.

రమకూడా ఒప్పుకుంది.

"పదివేలు" అన్నాడు సేఠ్.

"దానికీ, దీనికీ తేడా ఏమిటి ?" రెంటినీ చూపించి అడిగింది రమ.

సేఠ్ నవ్వి "లెన్సుపెట్టి చూపిస్తారు" అన్నాడు.

రామకృష్ణ నిర్లక్ష్యంగా "మీ మాట చాలదా ?" అన్నాడు.

రమ నవ్వుతూ "రెండూ తీసుకుంటే !" అన్నది.

రామకృష్ణ ఆశ్చర్యంగా ఆమెవైపుచూసి అన్నాడు. "అదెందుకు, నకిలీది ?"

రమకి ఏమనటానికీ తోచలేదు. నవ్వింది. "ఏం ?" అన్నాడతను.

"ఊరికే అన్నా" అందామె.

రామకృష్ణ ఊపిరి కొంచెం స్వేచ్ఛగా పీల్చాడు.

మళ్ళీ రమ చిరునవ్వుతో అంది.

"డైమండ్ నెక్లెస్ కొంటే ఒక ఇమిటేషన్ డైమండ్ నెక్లెస్ ఊరికే ఇవ్వాలండి సేఠ్‌గారూ"

"హ...హ...తమలాంటివాళ్ళే అలా అంటే !"

"హి...హి..." పెద్దగా నవ్వాడు రామకృష్ణ.

"ఇస్తే మాత్రం, తమరేం చేసుకుంటారు ?"

"ఏపని చేసేవాళ్ళకో ఇవ్వొచ్చుగా" రామకృష్ణవైపు చూస్తూ అందామె.

సేఠ్ పెద్దగా నవ్వాడు.

"పని చేసేవాళ్ళకి నెక్లెసు లెందుకండీ ?"

"బాగా చెప్పారు" అన్నాడు రామకృష్ణ.

"ఊరికే ఇచ్చినా, పేరేగాని, దీని ఖరీదుకూడా దాంట్లోనే వేసుకుంటారనుకోండి"

"ఎంతమాట !" అన్నాడు సేఠ్ సందర్భం సరిగా అర్థంగాక.

"సరే, ఇహ పోదాం" అన్నాడు రామకృష్ణ.

డబ్బు ఇచ్చేసి, కారులో స్టీరింగ్ దగ్గిర కూచుని ప్రక్కన కూచున్న రమవైపు చూసి అన్నాడు రామకృష్ణ.

"హడిలి చచ్చాననుకో. ఆ నకిలీది నిజంగా కొంటావేమోనన కున్నాను"

"అంత హడలెందుకు ?" రమ కొంచెం చిన్నబుచ్చుకున్నట్టుగా మాతి ముడిచి అంది.

"నువ్వు హాస్యానికన్నావని నాకేం తెలుసు ?"

"నా సంగతి మీకు తెలియదూ ?" వెంటనే అందామె.

"ఎందుకు తెలియదు ? అవతల వాడెక్కడ మీన్ మెంటాలిటీ అను కుంటాడోనని నా భయం. నీ హాస్యం సంగతి వాడికేం తెలుసు"

రమ ఏమీ అనలేదు.

"అయినా నువ్వు ఆ నకిలీదాన్ని గురించి గుచ్చి గుచ్చి అడగటం అంత బావుండలేదు రమా"

రమ ఒకసారి అతని కళ్ళల్లోకి చూసి హఠాత్తుగా గట్టిగా నవ్వేసి "నిజంగా నేనది కొంటాననే మీరనుకున్నారా ఏమిటి ?" రామకృష్ణకూడా నవ్వి "హ...హ..." అన్నాడు.

రాత్రి ఎనిమిది గంటలవేళ విద్యుద్దీపకాంతిలో ఉమ వజ్రాలహారం పరిశీలిస్తూవుంటే, ఆమె కెదురుగా టేబిల్ ఇవతల రమ కూచుని ఉమ ఇమి టేషన్ వజ్రాల నెక్లెసువైపు తదేకంగా చూస్తోంది. ఉమ పరీక్ష పూర్తిచేసి ఆ నెక్లెస్‌ని బల్లమీద ఉంచింది.

"ఎలా ఉంది ?"

"సరే అడగటమెందుకు ? చాలా బావుంది"

"నీ నెక్లెస్‌కీ, దీనికీ స్థూలంగా జూస్తే భేదం ఏమీలేదు"

"స్థూలమేమిటి, బాగా తెలిసినవాళ్ళకిగాని భేదం కనపడదు"

ఉమ తన నెక్లెస్‌తీసి బల్లమీద రమ నెక్లెసు కెదురుగా ఉంచి పోల్చి చూడసాగింది.

"నేనుకూడా అటువంటిదే కొంటే ఎలా ఉండేది ?"

"అదేమిటి ? నీకేం కష్టం ? కొనలేని నాలాంటి వాళ్ళకేగాని నీలాంటి పిల్లజమీందారిణుల కిలాంటి వెందుకు ? కొన్నా నలుగురూ నవ్వుతారు"

"భేదం కనపడనప్పుడేదైతే నేం ?"

"బావుంది. డబ్బు ఖర్చుపెట్టుకుని అనుభవించటం కోసం కాదూ ? మనల్ని మనం మోసగించుకుంటూ ఇతర్లని మోసగించటంలో ఆనందం ఏముంటుంది ?"

రమ ఆమెవైపు కొంచెం పరీక్షగా చూసింది.

"ఏమిటి నువ్వనేది ?"

ఉమ కొంచెం ముఖం ముకుళించుకుని అంది.

"నలుగురూ మంచి వజ్రాల నెక్లెస్ అనుకోవాలనేగా ఇది పెట్టుకోటం" ఆమె స్వరంలోని అసంతృప్తిని స్పష్టంగా గమనించింది రమ.

"అంతేనా ?"

"కాక ?"

రమ ఏమీ అనలేదు. ఆమె పెదవులు నవ్వటానికి ప్రయత్నించాయి.

"ఒక్కొక్కప్పుడు మనుషుల ఇష్టాఇష్టాలు చిత్రంగా ఉంటాయికదూ?" రమవైపు ఒకసారి చూసి "ఏం ?" అంది ఉమ.

"ఏం లేదులే. చూస్తే నీకు డైమండ్ నెక్లెస్‌మీద మనసు పారిందల్లే వుంది"

"మనసులకేం ! ఇష్టంవచ్చినట్టు పోతూనే ఉంటాయి. ధనమూల మిదం జగత్. అది లేనిదే ఏం లాభం ?"

"డబ్బుంటే అన్ని కోరికలూ తీరతాయా ?"

"డబ్బుతో సంబంధించినవన్నీ అని నా అభిప్రాయం"

రమ సమాధానం చెప్పకుండా తనలో తాను నవ్వుకున్నట్టుగా పెదవులు కొద్దిగా విస్తిరింప చేసింది. ఆమే అంది మళ్లీ, తన ప్రకటనకి సవరణ ప్రతిపాదిస్తూ.

"అయితే కొంతమంది డబ్బున్నా సుఖపడలేరులే"

"ఎవరి సంగతి నువ్వు మాట్లాడేది ?"

"మన రాజ్యంలేదూ! గెజిటెడ్ ఆఫీసర్ భార్యకదా ! పైగా ఎకరాలు అటూ, ఇటూ కూడా తెగకలిశాయా ! నిన్నకాక మొన్న ఇమిటేషన్ డైమండ్ నెక్లెస్ కొంది...."

రమ ఒకక్షణం ఉమ కళ్ళల్లోకి చూసింది. ఆమె చూపుల్లో విస్మయం, మరేదో భావంతో మిళితమై తాండవమాడింది.

"నీకు కూడా ఆశ్చర్యంగావుందా ? దాన్ని పీనాసితనమనాలో, కొంచెపు మనస్తత్వమనాలో నాకు తెలియటంలేదు"

రమ ముఖంలో కొంచెం కాంతి తగ్గింది. నెమ్మదిగా అంది. "చుట్టూ వున్న సంఘం అద్దంలాంటిది" ఉమ తన ధోరణిలో అంది. "రాజ్యానికి ఆలోచన తక్కువ. బొత్తిగా ఆలోచించదు. నలుగురిలో తిరుగుతున్నప్పుడు, తన్ని గురించి నలుగురూ ఏమనుకుంటారో దానికి అక్కర్లేదు. డబ్బు కూడబెడితే సరి...."

ఉమ విసుగ్గా "పోనిద్దూ" అంది. మరు క్షణంలో లైటు ఆరిపోయింది.

"ఎలక్ట్రిసిటి ఫెయిలయింది. ఇప్పుడే వస్తుందిలే మామూలే" అన్నది రమ కంగారుపడుతున్న ఉమతో. రెండు నిముషాలు గడిచాయి.

"దొంగలకి పగలంటె భయం, దొంగ వజ్రాలకి రాత్రి అంటే భయం" ఉమ నవ్వుతూ అంది. రమ యథాలాపంగా 'ఊఁ' అంది.

బయట దగ్గు వినిపించింది.

"అదుగో మా ముసలి నౌకరు షికారునుంచి ఇంటికి చేరుకున్నాడు"

"రోజూ సాయంత్రం మోతీని బయట తిప్పమన్నానులే"

రమ జవాబు పూర్తయేలోపలే మోతీ 'కుంయి' మంటూ ఆ అస్పష్ట కాంతిలో తన యజమానురాలిని గుర్తించటానికి ప్రయత్నించి, ఉమ కుర్చీలోకి ఒక్క దూకు దూకింది. ఉమ ఉలిక్కిపడి గభాలున ఆ కుక్కపిల్లని బల్లమీదకి విసిరేసింది. ఆ ఊపుతో మోతీ బల్లమీది రెండు నెక్లెసులతో సహా రమ ఒళ్ళోపడి కీచుమంటూ కూచుంది. రమ కుక్కపిల్లని నిమిరి బల్లమీద ఉంచింది. ఆమె ఒళ్ళో, చీకటిలోకి కాంతిని ప్రసారం చేస్తూ, దొంగని పట్టుకోటానికి వేసిన సెర్చిలైటులాగా వెలుగుతోంది డైమండ్ నెక్లెసు. ప్రక్కనే రహస్యం బయటపడిన దొంగలాగా వెలవెలపోతూ ఇమిటేషన్ డైమండ్ మినుకు మినుకు మంటోంది. రమ హృదయంలో అనిర్వచనీయమైన అభిమానం తప్పు ఒప్పుకొని అసహాయంగా దిక్కులుచూసే నేరస్థుణ్ణి చూస్తే కలిగే జాలి లాంటిది—ఏదో కలిగింది. ఆ రెంటివైపూ ఆమె అలాగే చూడసాగింది.

లైట్లు వెలిగాయి.

"అమ్మయ్య ఇహ వెడతాను" ఉమ లేచి నుంచుంది. రమ ఆమెచేతికి నెక్లెసు అందించింది. నెక్లెసు అందుకుంటూన్న సమయంలో రమ చెయ్యి తగిలి, కొంచెం ఆశ్చర్యంతో అంది ఉమ.

"ఇంత వేడిగావుంది—జ్వరం తగిలిందా ఏమిటి ?"

"ఊ(హు....ఏం లేదు" రమ నసిగింది.

"అదేమిటి కొంచెం వణుకుతున్నావుకూడా. డాక్టరుకి కబురుచెయ్యి"

"అబ్బ ఏం లేదులే" కొంచెం విసుగ్గా అన్నది రమ. రామయ్యా, డ్రైవర్‌ని త్వరగా కారు తీసుకు రమ్మను. అమ్మగారు వెడుతుందిట"

ఉమ నెక్లెసు పెట్టుకుని బయలుదేరింది. అదే క్షణాన మళ్లీ లైట్లు ఆరిపోయాయి. తన కంఠంలో కాంతివంతంగా వెలిగే నెక్లెసువైపు ఆశ్చర్యంగా చూసి ఉమ వెనక్కి తిరగబోయే సమయంలో హఠాత్తుగా మళ్ళీ లైట్లు వెలిగాయి; ఆమె వెనక్కి తిరిగి చూసింది. రమ కుక్కపిల్లని 'ఫీట్సు' చేయిస్తోంది.

ఆమె ఇదేం గమనించినట్టు లేదు.

"రమా, మన నెక్లెసులు సరిగా ఉన్నాయా ?"

"ఎందుకుండవు. చాదస్తం, పద పోదాం"

"మారుపడలేదు గద !"

"ఎందుకు పడతాయి ? ఒకవేళ పడితేమాత్రం ఇందులో పోయేందుకు లక్ష లేమున్నాయి ?"

"అబ్బ, ఎంత నిర్లక్ష్యం ? ఇదంతా నాదగ్గిరే ఎలాగూ పోదని ధైర్యం"

"సరేలే, అదుగో డ్రైవర్ వస్తున్నాడు పద."

ముందుకు పోయేబదులు ఉమ వెనక్కి వచ్చి, స్విచ్ వేసింది. లైటు ఆరిపోయింది. ఉమ నవ్వి అంది. "ఇప్పుడు తెలిసిందా ?" ఆమె నవ్వుతో పాటు లైటుకూడా వెలిగింది. "అసలు పొరపాటు చేశాను. కొట్టేసి ఉండాల్సింది తెలివితక్కువదాన్ని"

"నువ్వు తెలివిగలదానివని ఎవరనుకున్నార్లే !" రమ ముఖంమీద కొట్టినట్టుగా ఇలా అనటం మొదటిసారి కాకపోయినా, ఈసారి నవ్వుతూ అలా అనక అతి విసుగ్గా అనటం స్పష్టంగా గమనించిన ఉమ రమవైపు ఒక క్షణం తేరిపార చూసింది.